# ఆంధ్రయువకుడా! దారి ఇటు-

[పల్లెటూళ్ళు రమ్మని పిలుస్తున్నాయి. దేశం రమ్మంటోంది అంటే అర్థం నేలతల్లి పిలుస్తోంది. అమెరికాకు ప్యాసుపోర్టు వచ్చినా నాగరికత డబ్బు కృత్రిమ నిలవల వ్యామోహానికి బానిసకావడం యిష్టంలేక ఒంటరిగా పోరాటం సాగించి తన జీవన గమ్యాన్ని సాధించిన రవి ఈ కథలో ఒక కొత్త సూర్యుడు. అటు మేనమామ పన్నిన వుచ్చులిని త్రెంపుకుంటూ యువతరానికి ప్రతినిధిగా నిలబడి, తను పుట్టిన గడ్డకు సేవచేస్తూ నిరుపేద లకు అండగా నిలబడి ధర్మాన్ని నెగ్గించి, జీవితాన్ని వెలుగుబాటవైపు మరల్చిన ఒక నవయువకుని కార్యదీక్షకు యీ కథ మచ్చుతునక.

అయితే శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి లేఖిని నుండి వెలు వడిన యీ కథ, ఒక సినిమా కథకు బీజప్రాయమైన ఇతివృత్తం మాత్రమే. వెండితెర కథకు ఇది సమగ్ర రూపకల్పన కాదు.... ఇది సూత్రప్రాయంగా మీ అభిమాన రచయిత్రి వ్రాసిన సినిమా కథకు తొలి రూపం - పాఠకులు సినిమాకథలు ఎలా వ్రాస్తారో తెలుసుకుందుకు వాచవిగా యీ 'సినాప్సిస్'ను ప్రచురిస్తున్నామని మనవి.]

ఆంధ్రదేశంలో ఒకచిన్న పల్లెటూరు అది.

దేశంలో వున్న అన్ని పల్లెటూళ్ళులాగానే అది కూడా ఎలాటి సౌకర్యం లేకుండా, అక్షరాస్యతలోపించి, డబ్బున్నవాడిదే రాజ్యం అన్నట్టు - కలిమితోవున్న నాలు గైదు కుటుంబాలే వూరిని పరిపాలించడం జరుగుతోంది.

లేనివాళ్ళు వున్నవాళ్ళ కనుసన్నలలో మెసులుతూ, అలా మెలగలేనివాళ్ళు, వాళ్ళ ఆగ్రహావేశాలకి గురి అయి, ఏదో నెపంమీద నేలమట్టం గావించబడుతూ వున్నారు.

ఆ వూరి చివర ఒక తోట వుంది.

ఆ తోటలో మామిడి చెట్టుకి ఒక వుయ్యాల వేసివుంది.

దానిమీద ఎనిమిదేళ్ళ అమ్మాయి ముద్దబంతి పువ్వులా, పచ్చగా, బొద్దుగా వుండి చెరుగ్గడనములుతూ వుయ్యాల వూగుతోంది.

ఆ అమ్మాయి వెనక సన్నగా, రివటలా వున్న పది పన్నెండు సంవత్సరాల కుర్రాడు ఒకతను నిలబడి వుయ్యాలని వూపుతున్నాడు.

వాళ్ళిద్దరూ బావా మరదళ్ళు.

ఇద్దరిమధ్యా బంధుత్వం కంటే ఒకేవయసువల్ల కలిగిన చెలిమి బలంగా వుంది.

* * * *

మరోసారి.

వూరిమధ్యగా చెరువుంది.

అందులో అబ్బాయి యీతగొడుతూవున్నాడు.

అమ్మాయి మెట్లమీద కూర్చుని అతను నీళ్ళలో రకరకాలుగా చేస్తున్న విన్యాసాలని ఆనందంగా గమనిస్తోంది.

అమ్మాయి దృష్టి వున్నట్టుండి చెరువుమధ్యగా వున్న కలువ పూలమీదకి మళ్ళింది. వేలుపెట్టిచూపిస్తూ, బావా! అవి నాకు కావాలి." అంది.

అబ్బాయి యీదుకుంటూ వెళ్ళి రెండు చేతుల నిండా తెల్లని ఎఱ్ఱని కలువపూలు కోసి తెచ్చి అమ్మాయికి యిచ్చాడు.

*   *   *   *

ఇంకోసారి యిద్దరూ వూరికి కుడివైపున, బాగా పాతది అయి, శిథిలమైనకోట దగ్గర మెట్లమీద కూర్చుని వున్నారు.

అబ్బాయి శిథిలమైన ఆ కోట చరిత్ర, అందులో నివసించిన వారి వైభోగం గురించి చెబుతున్నాడు.

ఆ రాజుగారు, తెల్లవాళ్ళతో యుద్ధంచేసి, గెల్చిన ప్రతిసారీ భార్యకి అనేకరకాలైన కానుకలు తెచ్చేవాడుట.

"బావా! నువ్వుకూడా పెద్దయిన తర్వాత ఏదయినా యుద్ధంచేసి, నాక్కూడా అలాగే కానుకలు తీసుకురావాలి" అంది అమ్మాయి.

"యిప్పుడు అలాటి యుద్ధాలులేవుగా, నేను బాగా పెద్దయిన తర్వాత నీకు మంచి కారు కొనిపెడ్తాను" అన్నాడు అబ్బాయి.

అమ్మాయి కళ్ళు ఆనందంతో మెరిసాయి.

"దానికి రెక్కలుండాలి" అంది.

అబ్బాయి ఫక్కుమని నవ్వాడు.

అమ్మాయి శృతి కలిపింది.

ఇంతలో యింటి నౌకరు రంగడు పరుగెత్తుకు వచ్చాడు.

"బాబూ! మీ రిక్కడ వున్నారా? మీ కోసం యిందాకట్నుంచి వెతుకుతున్నాను. చప్పున లగెత్తుకు రండి. యింటికిపోదాం" అంటూ తొందర చేశాడు.

అమ్మాయి, అబ్బాయి చెయి చెయి పట్టుకుని, మెట్లు దిగి, యింటివైపు వచ్చారు.

ఇంటిముందు జనం మూగివున్నారు.

ఇంట్లోంచి పెద్దగా ఏడుపులు విన్పిస్తున్నాయి.

అమ్మాయి, అబ్బాయి ముఖాలు చూసుకున్నారు.

చుట్టూమూగివున్న వాళ్ళని తప్పించుకుని పిల్లలిద్దరూ లోపలికి వెళ్ళారు. లోపల కుఱ్ఱాడి తల్లి అన్నపూర్ణమ్మ ముఖానికి చెంగుకప్పుకుని గుండెలు పగిలేలాఏడుస్తోంది.

ఆవిడ ప్రక్కనే అన్నగారయిన భూషణం నిలబడి వున్నాడు.

ఏడుస్తున్న అన్నపూర్ణమ్మకి ఎవరో కొడుకు వచ్చిన వార్త విన్పించారు.

తలెత్తి చూసిన ఆవిడ, కొడుకుని కౌగలించుకుని, 'బాబూ! రవీ' అంటూ ఆపైన మాటలు పెగలకపోవటంతో బావురుమంది.

ఉప్పు సత్యాగ్రహంలో జైలుకి వెళ్ళిన తన తండ్రి అనారోగ్యానికి గురి అయి మరణించినట్టుగా రవి తెలుసుకున్నాడు.

రాధ ఏడుస్తున్న బావని, మేనత్తని బిక్కముఖంతో చూడసాగింది.

501

"రాధా! యిలా రామ్మా!" అంటూ తండ్రి భూషణం దగ్గిరకు పిలచి ఆ అమ్మాయి భుజాలుచుట్టూ చేయి వేసి దగ్గరకు తీసుకున్నాడు.

భూషణం ఆ వూరి కంతటికీ పెద్ద మోతుబరి రైతు.

రాధ ఆయనకి ఒక్కగానొక్క పిల్ల.

"వూరుకో అక్కయ్యా. అయిందేదో అయిపోయింది. పిల్లాడినిచూసయినా ధైర్యం తెచ్చుకోవాలి నువ్వు" అంటూ భూషణం అక్కగారిని ఓదార్చాడు.

* * * *

దినవారాలు అయిపోయినాయి.

వూల్లో రావిచెట్టు క్రింద కూర్చుని నలుగురూ, చనిపోయిన రామయ్య ఔదార్యం గురించి నాలుగు రకాలుగా ప్రశంసిస్తూ అనుకోసాగారు.

"ధర్మరాజు! చేయెత్తి దణ్ణం పెట్టాలి" అని ఒకరు,

"ఆయనతోపాటే మన బీదోళ్ళ అండకూడా పోయింది" అని యింకొకరు,

"చల్లని తండ్రి. చెయి జాపి అడగాలేకానీ, లేదు అనే మాటే వచ్చేదికాదు" అంటూ తలో విధంగా గుర్తు చేసుకోసాగారు.

* * * *

అదే సమయంలో భూషణంగారు, అక్కముందు శివం శిలా చిందులేస్తున్నాడు.

అన్నపూర్ణమ్మకి భర్తపోయిన తర్వాత పడిపోటానికి సిద్ధంగా వున్న ఒక్క పెంకుటిల్లుతప్ప యింకేం మిగలలేదు.

"అప్పుడు నేను చెబితే విన్నారా? ఒళ్లూ పై తెలియకుండా గొప్పకోసం ఖర్చుపెడితే ఏమౌతుంది? యిప్పుడు చెప్పు.

ఈ దానకర్ణుడు, ధర్మదాత అని పొగిడిన వాళ్ళంతా వచ్చి నీకూ, నీ కొడుక్కి అన్నం పెడతారా? పసివాడు. కనీసం వాడిముఖం చూసయినా జాగ్రత్తపడ్డారా మీరు? పైనుంచి కాస్త గట్టిగా హెచ్చరించానని, నన్ను వెలివేసినట్టు మా యింటికి మీరు రాకుండా, నన్ను మీ యింటికి రానివ్వకుండా నాతో మాట్లాడటం మానేసారు." అన్నాడు.

కళ్ళనీళ్ళు గుక్కుకుంటున్న అన్నపూర్ణమ్మ అన్నగారు విసురుతున్న యీ అభియోగానికి సమాధానం చెప్పలేదు.

అసలు మొదటినుంచీ భూషణంగారికి, ఆయన బావ అయిన రామయ్యకి క్షణంపడేది కాదు. స్వార్థపరుడు అయిన భూషణానికి, నిస్వార్థపరుడైన రామయ్య ఎప్పుడూ కంటిలో నలుసులా మెరమెరలాడుతూనే వుండేవాడు. మనసులో వున్నమాటని నిర్మహమాటంగా మొహంమీద అనేసేవాడు రామయ్య. ఒకే వూళ్ళో వివిధ వర్గాలకి నాయకులుగావున్న యీ యిద్దరికీ ప్రత్యక్షంగా కాకపోయినా, ఏదో రకంగా పట్టుదలలు, విరోధాలు వుంటూనే వుండేవి. అందుకే అక్కా తమ్ముడూ అయినా, ఆ యింటిమీద కాకి యీ యింటిమీద

వాలేదికాదు. పెద్దవాళ్ళమధ్య ఎలాటి వైషమ్యం వున్నా, యిరువర్గాలవారూ పిల్లలిద్దరినీ ఆపేక్షగానే చూసేవాళ్ళు. అందువల్ల రాధకి, రవికి మధ్య చనువుకి ఎలాటి ఆటంకం కలగలేదు.

బావ యీ విధంగా హఠాన్మరణం చెందటంతో భూషణం ప్రాణం కుదుటపడ్డట్టయింది. ఇక ఆయనకి ఆ వూళ్ళో ఎదురుచెప్పేవారు గానీ, అడ్డు నిలచేవాళ్ళుగానీ లేనేలేరు.

భూషణం అక్కగారిని, మేనల్లుడిని, తన యింటికి తీసుకు వచ్చాడు. అన్నపూర్ణమ్మ రావటానికి వెనకంజ వేస్తుంటే, "యింకెందుకమ్మా నీకు అనుమానం. నాకు బావతో వచ్చినవైరం, బావతోనే పోయింది. నాకు మాత్రం ఎవరున్నారు చెప్పు. రాధ పుట్టినప్పుడే నీ కోడలు అనిఅన్నావు. యింకేం. అమ్మాయి నీ దగ్గరకి కోడలుగా వచ్చేబదులు, అబ్బాయి నా దగ్గరకి అల్లుడుగా వచ్చాడు. వాడిని అన్ని విధాలా, ఏలోటు రాకుండా, పెంచి పెద్దచేసి, పైకి తెచ్చే బాధ్యత నాది. సరేనా" అన్నాడు.

భూషణం రవి భవిష్యత్‌కి భరోసా యివ్వడంతో; అన్నపూర్ణమ్మ, సంకోచం వదిలి కొడుకుతో తమ్ముడి యింటికి వచ్చింది.

* * * *

రవి అదేవూళ్లో హైస్కూలులో చదువుతున్నాడు.

మామూలుగా తన సామాన్యమైన దుస్తులతో, సత్తు క్యారియలో అన్నం తీసుకుని, స్కూలుకి బైలుదేరిన రవిని, భూషణంగారు చూసి, దగ్గరకు రమ్మని పిల్చారు.

"చూడు బాబూ! యిప్పుడు నువ్వు రామయ్య కొడుకువికాదు. భూషణంగారి మేనల్లుడివి. నువ్వు ఏ పని చేసినా, ఏమాట మాట్లాడినా, మన అంతస్థుకి, హోదాకి తగినట్లు వుండాలి. ముందు ఆ క్యారియర్ తీసుకెళ్ళి అవతల పారేయ్. షావుకారికి కబురు చేసాను. బట్టలుతాన్లు పంపిస్తున్నాడు. వాటిల్లో ఖరీదుగలవి నీకు ఏవి కావాలో చూసుకో. ఆ బట్టలు కుట్టి తెచ్చేవరకూ స్కూలు మానేయ్" అన్నాడు.

రవి నిస్సహాయంగా చూసాడు. అతని అభిమానం గాయపడింది.

మేనమామకి ఘాటుగా సమాధానం చెప్పబోయే లోపల, యింతలో అన్నపూర్ణమ్మ కొడుకుని రమ్మనమని పిలిచింది.

అతన్ని పక్కకు తీసుకెళ్ళి "మామయ్య చెప్పినట్టు వినుబాబూ. అంతా మనకి మంచే జరుగుతుంది. నువ్వు బాగా అభివృద్ధిలోకివస్తావు" అంటూ అనునయంగా నచ్చ చెప్పింది.

రవి స్కూలుకి వెళ్ళాడు. అతనికి స్టీలుక్యారియర్‌లో అన్నం వచ్చింది. నౌకరు రంగడు అన్నం తెచ్చి, రవి తినే వరకూ వుండి మళ్ళీక్యారియర్ తీసుకుని వెళ్ళాడు.

రవి స్నేహితులైన గోపాలం, మధు రవి అదృష్టానికి అభినందించారు. ఇంకా కొంతమంది యీర్ష్యపడ్డారు.

* * * *

ఈ పల్లెటూరులో, యీ తక్కువరకం మనుష్యుల మధ్య రవి భుజం భుజం రాచుకుంటూ తిరగడం ఏమాత్రం యిష్టపడని భూషణంగారు, రవిని వెంటతీసుకెళ్ళి హైదరాబాద్ పబ్లిక్ స్కూలులో, చేర్పించి, హాస్టల్లో జాయిన్ చేసి యింటికి తిరిగి వచ్చాడు.

కాలం రెక్కల గుఱ్ఱంలా పరుగెత్తింది.

క్యాలెండర్లు గబగబా తిరిగిపోయినాయి.

చూస్తుండగానే పదిహేను సంవత్సరాలు యిట్టే కాలగర్భంలో కలిసిపోయినాయి.

ఈ పదిహేను సంవత్సరాలలో దేశంలో ఎంతో మార్పు వచ్చింది. కొత్తగా లభించిన స్వాతంత్ర్య నాయకులు గట్టిగా పీల్చుకుంటున్నట్టు త్రివర్ణ పతాకం వాడవాడలా, రెపరెపలాడుతూ ఎగిరింది. ఈ మధ్యకాలంలో, భూషణం గారు యింకా స్థితిమంతుడయాడు. పొగాకులో ఆయనకు ఏటేటా చెప్పలేనన్ని లాభాలు వచ్చినాయి.

ఆయనిప్పుడు ఆ వూరికేకాదు, ఆ చుట్టుప్రక్కల పది గ్రామాలకి మోతుబరిరైతు. అన్నివిధాలా, ఆయనకి, అన్ని వర్గాలతో పరిచయంవుంది. ఏ పనైనా యిట్టే చేయించగల పలుకుబడికూడావుంది.

* * * *

రాధకి యుక్త వయసు వచ్చింది.

రవికూడా పెద్దవాడయ్యాడు.

భూషణంగారు, రవి మీద పెట్టిన డబ్బు పూర్తిగా సద్వినియోగం అయిందనే చెప్పాలి. రవి చదువులో ఎప్పుడూ ఫస్ట్‌నవుండేవాడు. ఆటల్లోకూడా అతనికి అనేక రకాల బహుమతులు వచ్చేవి.

ఎం. ఏ. యూనివర్శిటీ ఫస్ట్‌నపాసయి, భూషణంగారితో సహా, ఆయన మిత్రుల ప్రశంసలకి, గౌరవాభిమానాలకి గురి అయ్యాడు.

రవిని వున్నత విద్యకోసం, విదేశాలకి పంపి, యింకా, యింకా గొప్పవాడిని చేయాలని, ఫలానివారి అల్లుడు అని అందరూ ఘనంగా చెప్పుకుంటూంటే, చూసి సంతోషించాలని భూషణంగారికి గొప్ప ఆశ. రవి మెరికలాంటి కుర్రాడు. అతని వుజ్వలమైన భవిష్యత్ మీద భూషణంగారికి దృఢమైన విశ్వాసం వుంది.

రవి బుద్ధి తెలిసినప్పటినుంచీ చదువు నెపంమీద సిటీలోనే పెరిగాడు. కల్పతరువులాంటి మామయ్య నీడలో, దేనికీలోటు అనేది ఎరగకుండా, పెరుగుతూవచ్చిన అతను దాదాపు లేమి అంటే ఏమిటో మర్చిపోయాడు. అతని చుట్టూవున్న స్నేహితులుకూడా అతనితో సరిసమానంగా తూగగల శ్రీమంతులే!

వేసవి శలవులువస్తే, భూషణంగారు రవిని పల్లెటూరులో వ్యర్థంగా కాలం వెళ్ళదీయనిచ్చేవాడుకాదు.

దేశం చూసిరమ్మనమని ప్రతిసారీ ఉత్తరదేశమో, దక్షిణదేశమో పంపేవాడు.

చాకులా వాడిగా, మెరుపులా చురుగ్గా, దొరబాబులా ఠీవిగా వున్న అల్లుడిని చూస్తే ఆయనకి చాలా సంబరంగా తృప్తిగా, గర్వంగా వుండేది. రవి అందరి కుర్రాళ్ళలాటి వాడు కాదు. అతనిలో ఏదో ప్రత్యేకత వుంది అనుకునే వాళ్ళంతా.

ఆ చుట్టుపక్కల పది వూళ్ళమధ్య తన అల్లుడికి సాటి రాగలవాళ్ళు ఎవరూ లేరని మీసం మెలేస్తూ, సగర్వంగా చెప్పుకునేవాడు భూషణం.

*    *    *    *

పట్నంలో-

విద్యార్థుల గది అది.

రవి వూరు వెళ్ళటానికి ప్రయాణం అవుతున్నాడు.

అతని మిత్రబృందం గాలిదుమారంలా వచ్చిపడింది గదిలోకి.

ఒకరు "యిప్పుడే వెళ్ళి ఏంచేస్తావోయ్? యిక్కడే నాలుగు రోజులుండు. సరదాగా ఎంజాయ్ చేద్దాం. మళ్ళీ ఎప్పటికి కలుస్తామో, ఏమో" అన్నాడు.

ఇంకోరు "ఈరోజే ఎలిజబత్ టైలర్ పిక్చరుంది. అది చూసి వెళ్ళు" అన్నాడు.

మరొకరు "సిటీ హాలులో చిన్మయానంద లెక్చరు వుంది వెళ్దాంపద" అన్నాడు.

వాళ్ళందరిలో విద్యార్థి జీవితానికి శాశ్వతంగా గుడ్ బై చెబుతున్న యీ మధుర క్షణాల్ని అందరూ కలిసి, ఏద యినా ఒక మంచి జ్ఞాపకంగా మిగుల్చుకోవాలనే తహతహ కన్పిస్తోంది.

రవి ఆరోజుకి ఆగిపోయాడు.

మిత్రులు నలుగురూ, ఎవరెవరు ఎలాటి వృత్తులలోకి వెళ్ళినా ఒకరిని ఒకరు మర్చిపోకూడదని, ఏదయినా అవసర మయితే సహాయపడాలని వాగ్దానాలు చేసుకున్నారు.

రవి అమెరికా వెళ్ళటానికి ప్రయత్నాలు జరుగుతు న్నాయని తెలిసిన మిత్రులు అతన్ని అభినందించారు.

ముందు రవి వెళ్ళి అక్కడ సెటిల్ అయిపోతే, ఏద యినా అవకాశంవస్తే వాళ్లుకూడా బైలుదేరి వచ్చేస్తామని అన్నారు.

ఈ దేశంలో యింతంత డబ్బుతగలేసి చదవటమే తప్ప చదువుకి తగిన వుద్యోగాలు దొరకవనే నిస్పృహ వాళ్ళలో ఒక్కక్షణం బాగా కన్పించింది.

*　　*　　*　　*

పల్లెటూరులో

రవి దగ్గరనుంచి వస్తున్నట్టుగా టెలిగ్రాం వచ్చింది. అదిచూడగానే భూషణంగారుచేసిన హడావుడి అంతా యింతాకాదు.

రంగడిని పిలిచి బండి సిద్ధంచేసి అందులో పట్టుపరుపు వేసి స్టేషన్‌కి తీసుకెళ్ళమన్నాడు.

మంగని పిలిచి వేణ్ణీళ్ళు స్నానానికి సిద్ధంచేసి వుంచమన్నాడు.

కూతురిని పిలిచి "మీ బావ రాగానే కాఫీ, టిఫిన్ రెడీగా వుండేలా చూడమ్మా" అన్నారు.

బావ వస్తున్నాడనే వార్త వినగానే రాధ సిగ్గుల దొంతర అయి యింట్లోకి పారిపోయింది.

భూషణం గారింట్లో పిల్లి చిఱ్ఱున చీదినా ఆ వార్త వూరంతా తెలియాల్సిందే. క్షణంలో పట్నంనుంచి రవి వస్తున్నాడన్న వార్త వూరంతా పాకింది.

* * * *

రవి రైలు దిగేసరికి, అలవాటుగా, ఎప్పటిలా రంగడు కన్పించాడు.

రంగడు సంబరంగా "బాబుగారు, అచ్చు అమెరికా నుంచి యిప్పుడే దిగిన దొరలా వున్నారు" అన్నాడు.

"ఓరి పిచ్చివాడా! నేనింకా అమెరికా వెళ్ళనేలేదు" అన్నాడు రవి.

రవి ఎడ్లని ఒకసారి ఆప్యాయంగా మూపురం నిమిరి, వచ్చి బండిలో కూర్చున్నాడు.

రంగడు హుషారుగా ఎడ్లని అదిలించాడు.

రవి వూళ్ళో అందరి క్షేమసమాచారాలు అడగసాగాడు. ఆ బండి వెడ్తున్న రోడ్డు బొత్తిగా బాగాలేదు.

ఒకొక్కసారి, ఒకొక్క కుదుపుకి, రవి 'అబ్బా!' అని నడుం సరిచేసుకోవాల్సి వస్తోంది.

ఒకచోట బురదలో కూరుకుపోయింది.

రంగడు ఎంత ప్రయత్నించినా చక్రం ఎత్తలేక పోయాడు.

రవి 'నేను వస్తానుండు' అంటూ దిగివచ్చి, చక్రం ఎత్తాడు.

అతని ముఖాన్నిండా చిరుచెమటలు అలుముకున్నాయి. షర్టుకి బురద అంటింది.

బురదవైపు కంపరంగా చూసుకున్న రవి, "రంగా! వుండు ఒక్క నిముషం." అంటూ పెట్టె తెరిచి, షర్ట్ తీసి మార్చేసుకున్నాడు.

బండి మళ్ళి సాగింది. రవి విసుక్కున్నట్లుగా అన్నాడు.

"దేశానికి స్వతంత్ర్యం వచ్చి యిన్నాళ్ళయింది. దేశం అంతా బాగుపడుతుంది. మనఊరికే మోక్షం లేదు." ఈ రోడ్డు యీ జన్మకి బాగుపడడం చూడం మనం."

"రోడ్డు మాటేమోగాని, యీ రోడ్డు వేయించటానికి కాంట్రాక్టుతీసుకున్న మన బ్రహ్మయ్యగారు మాత్రం బాగు పడ్డారండి. మనఊళ్ళో బ్రహ్మాండమైన మేడకట్టారు. కూతురికి నలభైవేలు యిచ్చి ఘనంగా పెళ్లిచేసారు." అన్నాడు రంగడు.

* * * *

రవి యింటికివచ్చాడు.

వరండాలో అప్పటికే భూషణం, ఆయన కుడిభుజం లాటి బ్రహ్మయ్య, ఎడం భుజంలాటి ధర్మయ్య, షావుకారు నిలబడి వున్నారు.

రవిని వాళ్ళు కుశల ప్రశ్నలు వేశారు.

అందరూ కలిసి కాఫీ, ఫలహారాలు తీసుకున్నారు.

భూషణంగారు బ్రహ్మయ్యని పాస్‌పోర్ట్ విషయం హెచ్చరించారు.

"అబ్బాయి ఎక్కువ రోజులు యీ పల్లెటూళ్ళో వుండ లేడు. సాధ్యమైనంత త్వరగా ఆ పని ముడిపడేట్టు చూడండి" అన్నాడు.

"చిత్తం! అలాగే. నేను రేపే హైదరాబాదు వెళ్తు న్నాను." అన్నాడు బ్రహ్మయ్య.

రవి వచ్చాడని తెలియగానే ఊళ్ళోవాళ్ళంతా పేరు పేరునా వచ్చి పలకరించి వెళ్ళారు.

రవి శలవులకి వచ్చాడు.

చాలా కొద్దిరోజులే వుంటాడు.

అమెరికా వెళితే మూడు నాలుగు సంవత్సరాలవరకూ తిరిగి రాడు.

అందరూ అతన్ని ఎంతో అపరూపంగా చూస్తున్నారు.

భూషణంగారుకూడా; రాకరాకవచ్చిన బంధువుని చూసినట్టు చూస్తున్నారు.

రవికి బైటకివెళ్ళే పనేలేదు.

ఇంట్లోనే రాధతో బోలెడంత కాలక్షేపం.

తోటకి వెళ్దాం రమ్మని తీసుకెళ్ళి, రాధని వుయ్యాల మీాద కూర్చోపెట్టి, రాధకళ్ళు తిరిగి పడిపోతానేమో ననే భయంతో కెవ్వుమనేవరకూ పెద్దపెద్ద ఊపులు వేయడం అతనికో సరదా.

రాధని రమ్మని చెరువుదగ్గరకు తీసుకెళ్ళి, రాధ మెట్ల మీద కూర్చొని చూస్తుంటే నీటిలో యీతకొడుతూ, రక రకాలుగా విన్యాసాలు చేశాడు, రెండుచేతుల నిండా, ఎఱ్ఱవి, తెల్లవి కలువపూలు కోసియివ్వడంకూడా అతనికి సరదాగా వుండేది.

పాత కోటదగ్గరకెళ్ళి ఆ మెట్లమీద కూర్చుని, ఏవేవో కథలు చెబుతూవుండేవాడు.

"అమెరికా వెళ్ళి అన్నిరోజులుండిపోతే. నిన్నుచూడ కుండా వంటరిగావుండడం ఎలా బావా?" అంది పేలగా చూస్తూ రాధ.

"వెళ్ళిన కొద్దిరోజులకే మళ్ళీ వచ్చి నిన్ను పెళ్ళిచేసు కుని నా వెంట తీసుకెళ్ళిపోతాను." అన్నాడు రవి.

భూషణంగారు పెళ్ళిచేసి అల్లుడితో కూతురుని పంపా లని అనుకున్నారు. కానీ మంచి ముహూర్తం లేనందువల్ల వీలుపడలేదు.

భూషణంగారికి జాతకాలమీద చాలానమ్మకంవుంది. రాధ, రవి నక్షత్రాలప్రకారం నాలుగునెలల తర్వాత కానీ మంచి లగ్నం లేదు. కానీ పెళ్ళికోసం, అల్లుడిని ఫారిన్ ప్రయాణం ఆపడం భూషణంగారికి ఎంతమాత్రం యిష్టం లేదు.

రవి, రాధ కలిసి తోటలో ఒకప్రక్క పూలచెట్లు నాటారు.

రవి, వాటికి కుదుళ్ళుచేసి, నీళ్లుపోయేందుకు బోదులు చేసి, చేతులు కడుక్కుంటూ, "రాధా! యిది మనతోట.

నేను వెళ్ళిపోయిన తర్వాత ఏ చెట్టు ఎప్పుడు చిగురువేసింది, మొగ్గ తొడిగింది, ఆ పువ్వులు నువ్వు పెట్టుకుంటూ నన్నెలా గుర్తుచేసుకుందీ వుత్తరాలు వ్రాయాలి తెలుసా?" అన్నాడు. రాధ సిగ్గుగా తలూపింది.

రాధ, రవి తోటనుంచి యింటికి తిరిగివచ్చారు.

రవి తమాషాగా తలవంచి, "రాణీగారూ! కొద్దిసేపు శెలవిస్తారు? వచ్చినప్పటినుంచి తమరి సాన్నిధ్యంలోనే సరిపోయింది. తమరు అనుమతియిస్తే అలా ఊళ్ళోకి వెళ్ళి పాతస్నేహితులుని పలకరించివస్తాం." అన్నాడు.

"అనుమతి యివ్వబడింది. కానీ ఒక్క గంటమాత్రమే." అంది రాధ.

"చిత్తం."

*   *   *   *

రవి వూళ్లోకి బయలుదేరాడు.

అతని చిన్నప్పటి స్నేహితుడు గోపాలం ప్రతిసారీ రవి పూరినుంచి వచ్చాడని తెలియగానే వచ్చేవాడు.

ఈసారి రెండురోజులుగడిచినా రాలేదు.

రంగడిచేత కబురుచేస్తేకూడా వస్తానన్నాడేకానీ రానే లేదు.

గోపాలం, రవి చిన్నప్పుడు ప్రాణ స్నేహితులుగా మసిలేవాళ్ళు.

గోపాలం, రవి పట్నంవెళ్ళిన సంవత్సరానికే చదువు మానేసాడు. అతని ఆర్థికపరిస్థితి ఏమాత్రం బాగాలేదు.

తండ్రితోపాటు వ్యవసాయంలో సహాయంచేస్తూ, చాలా చిన్నతనంలోనే యింటిబాధ్యత నెత్తిన వేసుకోవాల్సి వచ్చింది.

రవి ముందు సరాసరి గోపాలం యింటికే బయలు దేరాడు దోవపొడుగునా, రైతులు, కూలీలు, చాకలివాళ్లు అందరూ అతన్ని ఆప్యాయంగా పలకరించి, కుశల ప్రశ్నలు వేసి, ఎంతో గౌరవంగా, మన్ననగా మాట్లాడారు. అందరి నోట్లోంచి ఒకటే మాట. "బాబుగారు, అమెరికా వెళుతు న్నారంటగా!" అనేవాళ్ళు "అంత గొప్పదేశం వెళ్ళిన తర్వాత మేం మీకు గుర్తుంటామా?" అంటూ సందేహం వెలిబుచ్చేవారు.

రవి వాళ్ళ అమాయకత్వానికి నవ్వుకునేవాడు.

గోపాలం యింటికి వెళ్ళాలంటే, దోవలో రంగనాథం టీచరుగారి యిల్లుదాటి వెళ్ళాలి. రవి ఆయన యింటిముందు ఆగి ఆయన్ని పలకరించాడు.

రంగనాథం వృత్తిరీత్యా టీచర్ అయినా, ఒకవిధంగా సంఘసేవకుడు అని చెప్పుకోవాలి.

ఆయన వీధిబడితో ప్రారంభించి, దాన్ని ఎలిమెంటరీ స్కూలుగా మార్పించి, హైస్కూలువరకూ తెచ్చాడు. ఆయనవయసు యిప్పుడు వుడిగిపోయింది. దూరపుచూపు ఆనదు. కీళ్ళవాతం వచ్చింది.

చాలా చిన్నప్పుడు, రంగనాథంగారికి పనులుచేసిపెట్ట టానికి రవి, గోపాలం, యింకో యిద్దరు పోటీపడి ముందుకు వచ్చేవాళ్ళు.

రవి స్వయంగా తనయింటికి రావడంతో రంగనాథం మేష్టారు పట్టలేని ఆనందంతో వచ్చి తబ్బిబ్బు అయాడు.

రవిని కూర్చోపెట్టి కుశల ప్రశ్నలు వేసాడు.

ఆయనభార్య రవి వద్దంటున్నా వినకుండా, పెద్ద యిత్తడిగ్లాసునిండా పాలు తెచ్చియిచ్చింది.

కొద్దిసేపు రవికి, మాష్టరుగారికి ఊరి విషయాలమీద చర్చ జరిగింది. రంగనాథంగారు ఊరిలో నివసిస్తున్న పెద్ద మనుష్యులు - వాళ్ళ ప్రవర్తనమీద చాలా అసంతృప్తి వెలిబుచ్చారు.

ఈ ఊరిలో యింత ఐశ్వర్యంగల మనుష్యులున్నారు. ఏ ఒక్కరూ ఊరిబాగుకోసం పాటుపడటంలేదు. అది అతనికి చాలా బాధగావుంది.

"ఏమిటి నీ సొద? అల్లుడుగారు, కాసేపు పలకరిద్దామని వస్తే నీ పురాణం విప్పావు." అంటూ రంగనాథంగారి భార్య శాంతమ్మ భర్తని మందలించింది. భర్తమాటల్లో ఎక్కడైన భూషణంగారిమీద వ్యంగ్యం కన్పిస్తుందేమోనని ఆవిడభయం ఎంతయినా ఆయన అల్లుడు. అతనికి తెలియని రాజకీయాలు ఏమున్నాయి?

* * * *

రవి రంగనాథంగారిదగ్గర శలవుతీసుకొని గోపాలం యింటికి బయలుదేరాడు.

రవి వెళ్లేసరికి గోపాలం యింట్లో గోపాలం, తల్లి ఘర్షణ పడ్తున్నారు. దానికి కారణం గోపాలం చెల్లెలయిన పార్వతిని

బ్రహ్మయ్య తన పెద్దకొడుకైన సత్యానికి చేసుకుంటానని కబురుచేసాడు. సత్యం మూగవాడు, ఒకవిధంగా పిచ్చివాడు కూడా. బంగారు బొమ్మలాటి పార్వతిని ఆ పిచ్చాడికి కట్టబెట్టడం గోపాలానికి ఏమాత్రం యిష్టంలేదు. "నా చెల్లెలిని యివ్వను." అని కబురుచేసాడు.

రెండురోజులు కూడా జరగలేదు.

బ్రహ్మయ్యదగ్గర అప్పుతీసుకున్న రెండు వేలు తక్షణం కట్టమని, లేకపోతే యిల్లు జప్తుచేస్తామని సమను వచ్చింది.

రెక్కలే జీవనాధారం అయిన గోపాలానికి ఆ యిల్లు తప్ప యింకేం లేదు. బ్రహ్మయ్య మాటపట్టింపుసంగతి వూరి అందరికీ తెలుసు. గోపాలం హితంకోరిన కొంతమంది అతనితో విరోధం పెట్టుకోవద్దని, ఆ పెళ్ళికి ఒప్పుకోమని సలహా యిచ్చారు. కలిగినవాళ్ళతో వైరం పెట్టుకుని వున్న వూళ్ళో గడపడం కష్టం అని భావించిన గోపాలంతల్లి మెత్తపడింది. సంబంధం ఖాయంచేయమని చెప్పింది. కానీ పార్వతి ఒప్పుకో లేదు. తనకి పెళ్ళికాకపోయినా ఫర్వాలేదు, జీవితాంతం కన్యగానైనా వుండటానికి సిద్ధపడతానుగానీ ఆ మూగవాడిని చేసుకోను అని ఎదురు తిరిగింది. మీరు బలవంతంగా, యీ పెళ్ళిచేయాలని చూస్తే, మీరు పెళ్ళిచేసేది నాకుకాదు. నా శవానికి అంది.

గోపాలం ఎటూ చెప్పలేకపోయాడు.

ఒకప్రక్క చెల్లెలు ఆశలు.

యింకోప్రక్క బ్రహ్మయ్య దౌర్జన్యం.

సరిగ్గా ఆ సమయంలో అక్కడికి రవి వచ్చాడు. రవిని చూడగానే యింట్లో గొడవసంగతి మర్చిపోయి, గోపాలం తల్లి శాంతమ్మ కుశలప్రశ్నలు వేసింది.

రవి గోపాలం తనని చూడటానికి రానందుకు నిష్ఠూరంగా మాట్లాడాడు.

గోపాలం ముక్తసరిగా తనయింట్లో చికాకులుచెప్పాడు.

ముత్యంలాటి పార్వతిని వెర్రిబాగుల పాండుకి యివ్వటమా?

రవి ఆ ఆలోచనే సహింపలేకపోయాడు.

రవివైపు నుంచికాస్త సమర్థింపు దొరికేసరికి పార్వతి వచ్చి అతనికాళ్ళకి చుట్టేసుకుంది. "రవిఅన్నయ్యా, అన్నకి నువ్వయినా చెప్పు. నా కసలు పెళ్లేవద్దు." అంది వెక్కి వెక్కి ఏడుస్తూ.

రవి పార్వతిని లేవదీసి ధైర్యంగా వుండమనిచెప్పాడు.

గోపాలంతో బ్రహ్మయ్యకి యీ పెళ్లికి ఒప్పుకోమని కబురు చేయమన్నాడు.

"ఆ! రేపీపాటికి నడిబజారులో వుండవలసివస్తుంది వీళ్ళు". అన్నా రొకళ్ళు.

రవి గోపాలాన్ని బ్రహ్మయ్యకి యివ్వవలసింది ఎంతో చెప్పమన్నాడు.

తీసుకున్నది అసలు 500 రూపాయలే. కానీ వడ్డీ పెరిగి పెరిగి రెండువేలయింది. గోపాలందగ్గర రెండువేలు కాదు, రెండు చిల్లిగవ్వలుకూడా లేవు.

రవి పెళ్ళి ఆపుచేయమని సలహాయిచ్చాడు.

ఆ తర్వాత, ఆ పెళ్ళి ఆగడం వల్ల, ఎలాటి ప్రమాదం రాకుండా చూడాల్సిన బాధ్యతకూడా తనమీద వుందని పించింది.

రవి గోపాలాన్ని తనవెంట రమ్మని అతన్ని తీసుకుని సరాసరి కోమటి గురవాచారి దగ్గరకు వెళ్ళాడు. గోపాలానికి రెండువేలు యిమ్మని, అవి తనుతీసుకున్నట్టుగా నోటు వ్రాసి యిస్తానని చెప్పాడు. నోటు తను వ్రాసియిస్తే తను లేనప్పుడు షావుకారు గోపాలంమీద దౌర్జన్యం చేసేందుకు అవకాశం వుండదని రవి విశ్వాసం.

ఈ సంగతి మేనమామకి తెలియాల్సిన అవసరంలేదని, తను తీర్చేస్తానని అన్నాడు రవి.

షావుకారు ముందు డబ్బుయివ్వటానికి తటపటాయిం చినా, తర్వాత యిచ్చేసాడు.

ఇల్లు జప్తుచేస్తాం అంటే ఖంగారుపడి కాళ్ల బేరానికి వస్తారని ఆశతో ఎదురు చూస్తున్న బ్రహ్మయ్యకి గోపాలం రుపాయలు తెచ్చియిచ్చి బాకీ ఫైసలా చేయమనడంతో, నడుం విరిగినట్టయింది. గోపాలానికి వున్నట్టుండి యింతడబ్బు ఎలా వచ్చిందో అతనికి అంతుబట్టలేదు.

కానీ అది చిన్న పల్లెటూరు.

బ్రహ్మయ్య ఆమాత్రం తెలుసుకోలేని అసమర్థుడు కాడు.

రవి డబ్బుసాయం చేసాడన్నవార్త అతనికి విషం తిన్నట్టుగా అయింది. రవిని ఏమీ అనలేని ఆయన షావుకారిని పిలిచి నిలదీసాడు. షావుకారు లబోదిబోమని మొత్తుకున్నాడు.

యివ్వకపోతే రవికి కోపం, యిస్తే వీళ్ళకి కోపం.

యిలా అడకత్తెరమధ్య పోకచెక్కలా నలగడం అతనికి అలవాటే.

బ్రహ్మయ్య భూషణం యింటికి వచ్చాడు.

రవి, రాధ, భూషణం అందరూ భోజనాలకి కూర్చున్నారు.

బ్రహ్మయ్యనుకూడా తమతోపాటు కలవమని ఆహ్వానించాడు భూషణం.

బ్రహ్మయ్య రవిని వ్యంగ్యంగా మాటలు విసిరాడు.

రవి అసలుసంగతి తెలియకపోయినా, ఆయనమాటలు నవ్వుతూనే తిప్పికొట్టి ఆయనముఖం ఎర్రబడేలా చేసాడు.

బ్రహ్మయ్యద్వారా యీసంగతంతా విన్న భూషణం మేనల్లుడితరఫున క్షమార్పణ కోరుకున్నాడు. రవి అమాయకుడని, యీవూరులో వుండటం తనకిష్టం లేదని, ఆ పాస్‌పోర్టేదో త్వరగా తెప్పిస్తే సాధ్యమైనంత త్వరలో అమెరికా పంపిస్తే మంచిదనుకుంటున్నానని అన్నాడు.

* * * *

రవికి పాస్‌పోర్టు రావటం ఆలస్యం అయింది. వూరికే సోమరిపోతుగా కూర్చోవటం రవికి చిన్నప్పటినుంచి అభ్యాసం లేదు.

సాయంత్రం వేళ అలా వూరిచివరకి షికారుగా వెళ్లే వాళ్ళు. అతని స్నేహితుల్లో యిద్దరికి పెళ్లిళ్లు అవుతున్నాయి. శుభలేఖలు వచ్చినాయి. ఒకతను ఫారెన్ వెళ్ళిపోయాడు. ఇంకో అతనికి ట్రాక్టర్ల కంపెనీ వుంది. అతనికి జీవితం సరదా సుఖంమీద ఆశ ఎక్కువ. 40 సం॥ వచ్చేవరకూ పెళ్లిచేసుకోనని తల్లిదండ్రులతో స్పష్టంగా చెప్పాడు. ఈలోపల కంటికింపుగా కన్పించిన ప్రతిపిల్లతో ప్రేమలోపడుతూ, లేస్తూ వుండడం అనే ఆట, చాలాసరదాగా వుందని వ్రాసాడు.

ఊరిచివరికి వచ్చిన అతను మాలపల్లెవైపు నడిచాడు. అక్కడ మురికి, ఆ మనుష్యులు, వాళ్ళ అనాగరికత అతని మనసుని కలిచివేసింది. మనుష్యుల్లో అందం లేకపోతేపోయింది. శుచి, శుభ్రతకేం? వీళ్ళలో కొంతమంది జీవించే తీరుచూస్తే పశువులకి, మనుష్యులకి తేడాయే కన్పించదు.

*   *   *   *

రవి యింటికి తిరిగివచ్చాడు.

అతని కేమిటో అసంతృప్తిగా, చిరాకుగావుంది.

రవిలో కన్పిస్తున్న యీ విసుగికి, మరోరకంగా అర్థం చేసుకున్న రాధ, తండ్రితో రవికి ఏం తోచటంలేదని చెప్పింది.

భూషణంగారు, అల్లుడి వినోదంకోసం ఆ రాత్రి కోయవాళ్ళ జానపదనృత్యం ఏర్పాటు చేసారు. (సంక్రాంతి)

రవి పాస్‌పోర్టు రావటానికి రెండు వారాలు వ్యవధి పడుతుందని, భూషణానికి బ్రహ్మయ్య చెప్పాడు.

ఆ రెండు వారాలు రవిజీవితాన్ని అనుకోని మలుపు తిప్పిస్తాయని, అతనిభవిష్యత్తే తలక్రిందులవుతుందని ఎవరూ కలలో కూడా అనుకోలేదు.

ఇంట్లో కూర్చోవడం విసిగేసిన రవి అలా వూరిలోకి వెళ్ళేవాడు. ఆ వెళ్ళినప్పుడు వూళ్ళో అనేక రాజకీయాలు అతను వింటూ వుండేవాడు.

వీళ్ళలో రెండువర్గా లున్నాయి.

వున్నవాళ్ళు, లేనివాళ్ళు.

వున్నవాళ్ళు చాలా కొద్దిమందే అయినా, లేనివాళ్ళని చాలామందిని తమ గుప్పెట్లో పెట్టుకున్నారు.

నిజంచెప్పాలంటే ఆవూరికి మూలస్థంభాల్లాటి వారు నలుగురే నలుగురు. భూషణం, బ్రహ్మయ్యా, ధర్మయ్యా, షావుకారు. యీ నలుగురూ కలిసి, ఆ బీదవాళ్ళకి చేసే అన్యాయాలు అంతా యింతా కాదు.

ఈ రోజున తను అనుభవిస్తున్న యీ సిరిసంపదలు, ఎంతమంది కన్నీళ్లో, ఎంతమంది నిట్టూర్పులో!

తమ స్వార్థంకోసం, అమాయకులైన ఆ తక్కువజాతి వాళ్ళని వంచేయటానికైనా వెనుదీయరు వీళ్ళు.

తక్కువ కులాలవాళ్ళకి చదువు రావటంగాని, తెలివి తేటలు అబ్బటం కాని వీళ్ళకి ఏమాత్రం యిష్టం వుండదు. వాళ్ళెప్పుడూ వీళ్ళకాళ్ళక్రింద ధూళిలా అలా వుండిపోవా ల్సిందే!

యింతమోతుబరి రైతులున్న ఈవూరికి హైస్కూలు లేదు. ఎందుకంటే వీళ్ళ పిల్లలు ఎలాగో యీ వూళ్ళో చదువుకోవటం లేదు.

యీ వూరికి మంచి రోడ్డులేదు. లేకపోయినా ఫర్వా లేదు. రోడ్డుమీద చెప్పులు లేకుండా వానాకాలంలో బురదలో, వేసవికాలంలో యిసకలో నడవటంలో గల బాధ వీళ్ళకి తెలియదు.

వున్నవాళ్ళంతా అలాంటి స్వార్థపరులు.

ఇక పోతే -

లేనివాళ్ళ సంగతి.

వీళ్ళకు జీవితాన్నిగురించి ఆలోచించే ఓపిక లేదు.

ఎదురుతిరిగే ధైర్యం అసలేలేదు.

మన ఖర్మ అని సరిపెట్టుకుని, నిర్జీవంగా వేళ్ళాడే మనస్తత్వం నరనరాల్లోనూ జీర్ణించుకు పోయింది.

ఈ అసమర్థుల ఆశల సమాధులమీద, భూషణంగారి లాటి వాళ్ళ అంతస్థు, హోదా, ఐశ్వర్యం నిలబడుతున్నాయి.

బలంవుంటేనే బ్రతుకు.

శక్తి, సామర్థ్యం గలవాళ్ళకి క్రీడాస్థలం అయిన యీ ప్రపంచంలో అల్పులకి, అవిటివారికి స్థానం లేనేలేదు.

బ్రహ్మయ్యలాటివాళ్ళు మనుష్యుల్ని కుక్కలకంటే హీనంగా, కుక్కల్ని మనుష్యులకంటే గౌరవంగా చూడగల గొప్పవాళ్ళు.

అడుగడుక్కీ స్వార్థం. ఎక్కడచూసినా అన్యాయం.

*   *   *   *

ఒకసారి వూళ్ళో పెద్ద దొమ్మీ జరిగింది.

దానికి కారణం చాలా చిన్నది.

వీధిలో గోలీలు ఆడుకునే పిల్లలతో ఆ తగాదా మొదలైంది. అది ఆడవాళ్ళవరకూ వెళ్ళి జుట్టూజుట్టూ పట్టుకునేవరకూ వచ్చింది. అది ముదిరి మగవాళ్ళు కఱ్ఱలు పుచ్చుకునివచ్చి నువ్వెంత అంటే నువ్వెంత అన్నారు. అటు కొంత మంది యిటుకొంతమంది చేరారు. తన్నుకోవటం ప్రారంభమైంది.

రంగడువచ్చి యీవార్త చెప్పగానే, రవి పరుగెత్తుకు వెళ్ళాడు.

ఆ గలాటాలో గోపాలంకూడా వున్నాడు.

గోపాలంమీద పాతకక్ష తీర్చుకోటానికి బ్రహ్మయ్య మనుష్యులుకూడా వచ్చారు.

దెబ్బలు తగిలాయి.

రవి సాక్ష్యం చెప్పాల్సి వచ్చింది.

రవి వున్నది వున్నట్టు చెప్పడంతో, బ్రహ్మయ్య మనుష్యులికి కఠినమైన శిక్షపడింది.

గోపాలాన్ని ఏదో సాకుతో జైలులోకి తొయ్యాలని బ్రహ్మయ్య చేసిన ప్రయత్నం ఆ విధంగా ఎదురుతిరిగి వాళ్ళ వాళ్ళకే చేతులకి బేడీలు వేసింది.

రవి యిలా గోపాలంవైపు చెబుతాడని ఎవరూ అనుకోలేదు.

భూషణం తలకొట్టేసినట్టయింది. బ్రహ్మయ్య మండిపడ్డాడు.

మొదటిసారిగా, మామా-అల్లుళ్ళ మధ్య అభిప్రాయ భేదం వచ్చింది.

గోపాలం విడుదల అవటంతో గోపాలంవైపు వాళ్ళకి పట్టలేనంత సంతోషంగా అన్పించింది. పండగలా చేసుకున్నారు. రవికూడా వాళ్ళ ఉత్సవంలో కలిసాడు. మాష్టరుగారు రవి నిజాయితికి, ధైర్యానికి మెచ్చుకున్నారు.

గోపాలం రవిని కౌగలించుకున్నాడు.

"నీలో యింత మంచిమనసువుందని అనుకోలేదు రవీ. నీ మంచితనం నీ చిన్నతనంతోనే పోయిందనుకున్నాను" అన్నాడు.

రవి వాళ్ళవైపు సాక్ష్యం చెప్పిందికాక, వాళ్ళతో కలిసి గంతులు వేయటం చూడగానే భూషణానికి శివం ఎత్తినట్టయింది.

అయినా తన ఆగ్రహాన్ని అణచుకున్నాడు. మనసులో వున్నమాట ఎప్పుడూ చప్పున పైకి అనేసే స్వభావం కాదు ఆయనది.

* * * *

రవి గోపాలంవాళ్ళతో కలిసాడు.

తీగ కదిలిస్తే డొంకంతా కదిలినట్టు ఒక అన్యాయం చేతబట్టి న్యాయం చేకూర్చేసరికి వంద అన్యాయాలు, మమ్మల్ని చూడమన్నట్టు అతని ఎదుట నిలబడ్డాయి.

వాటిల్లో అనేకరకా లున్నాయి.

రవి వాళ్ళందరినీ సంఘటితపరిచాడు.

ఎవరికివాళ్ళకే ప్రత్యేకతవున్నట్టు అందరినీ సభ్యులుగా చేసాడు. మొట్టమొదట వాళ్ళుచేయాల్సినపని మేము అల్పు లం, ఎందుకూ పనికిరానివాళ్ళం అనే భావం విడనాడటం.

సంఘ సమైక్యతవుంటే మనిషి దేన్నయినా అవలీలగా జయించగలడు.

మనకి కావాల్సిన వాటికోసం ముందు మనం ప్రయ త్నం గట్టిగా చేయాలి.

అతని యీ బోధలు అన్ని వింటున్న కొంతమంది హేళనగా "ఆఅలగాజనంతో మీకేటి బాబూ." అనేవాళ్ళు రవితో.

అటు వాళ్ళతో, "అబ్బాయిగారు యీ వూళ్లో శాశ్వతంగా వుండడు. ఆయనకి పాస్‌పోర్టు రాలేదు కాలక్షే పంకోసం యిదంతా చేస్తున్నాడు." అంటూ రెచ్చగొట్టారు.

అందువల్ల కొంతమంది రవిని నమ్మారు.

కొంతమంది నమ్మలేదు.

రవికి పాస్‌పోర్టు వచ్చేసింది.

భూషణం తలమీదనుంచి పెద్దబరువు దింపినట్టయింది.

ఈవార్త క్షణంలో వూరంతా తెలిసింది.

భూషణం సలహామీద బ్రహ్మయ్య హైకోర్టుకి అప్పీలు చేసాడు.

అక్కడకనక అతను గెల్చినట్టయితే గోపాలంవాళ్ళపని అయినట్టే.

ఆ కేసు రవి సాక్ష్యంమీద చాలా ఆధారపడి వుంది.

సాక్ష్యం చెప్పాల్సిన రవి విదేశాలు వెళ్ళిపోతున్నాడు.

రాంబందుల్లాటి బ్రహ్మయ్య చేతుల్లో తమ ప్రాణాలు చిక్కుకోక మానవు. అనుకోసాగారు.

రవి వుద్దేశ్యం చాలా వేరుగా వుంది.

అతను ఒకపని చేతపట్టాడు.

అందులో అతనికి ఆనందం సంతృప్తి కల్పిస్తున్నాయి.

ఇంకా, యింకా ముందుకు వెళ్ళాలనే వుత్సాహం కలుగుతోంది.

అతనికి హఠాత్తుగా విదేశాలువెళ్ళాలనే కోర్కెమీద విముఖత్వం ఏర్పడసాగింది

అక్కడికెళ్ళి తనేంచేయాలి? ఎవర్ని వుద్ధరించాలి?

అమెరికా" వెళ్ళి వచ్చినంతమాత్రాన తను పెద్దగా పొడిచేసేది మాత్రం ఏముంది?

అతనిదృష్టి జీవితలక్ష్యం అనుకోకుండా అమాయకు లైన యీ పల్లెప్రజలవైపు తిరిగింది.

వాళ్ళనిచూస్తుంటే అతనిగుండెల్లో జాలి, సానుభూతి సముద్రంలా పొంగుతున్నాయి.

వీళ్ళు అజ్ఞానంతో, బొత్తిగా, బాధ్యత లేకుండా ప్రవర్తిస్తున్నారు.

జీవితాలని అమాయకంగా, కుక్కలుచింపిన విస్తర్లలా చేసుకుంటున్నారు.

వీళ్ళలో చైతన్యం తీసుకు రావాలి.

ఇన్నాళ్ళూ తనకి ఒక ధ్యేయం లేదు. జీవితానికి ఆదర్శం లేదు.

ఇప్పుడు సుస్పష్టమైన మార్గం ఒకటి కన్పిస్తోంది.

ఈ మార్గం తనని ముందుకు రమ్మనమని, కవ్విస్తోంది.

తనలోని సంస్కారాన్ని, సమర్థతని సవాలు చేస్తోంది.

రవిలో ఘర్షణ ప్రారంభమైంది.

తను అమెరికా వెళ్ళటమా? మానటమా?

చేతపట్టిన యీ పనిని విడనాడటమా? లేక ముందుకు సాగిపోవటమా?

అతని జీవనగమ్యం హఠాత్తుగా రెండు దారులుగా చీలిపోయింది.

ఒకవైపు సుఖం! మరోవైపు శ్రమ!

ఒకటి గోతులు, బురద నిండిన అస్తవ్యస్తమైన మార్గం, రెండోది రాజబాట.

ఇందులో ఏది నిర్ణయించుకోవటం?

అదృష్టాన్ని గుడ్డిగా నమ్మి పెద్దవాళ్ళు చెప్పినట్టు వినటమా లేక భవిష్యత్‌తో పందెం వేసి జూదం ఆడటమా!

రవి ఆలోచించి, ఆలోచించి చివరకి ఒక నిశ్చయానికి వచ్చాడు.

అతను అమెరికా వెళ్ళదల్చుకో లేదు!

రవి ప్రయాణంకోసం ఆర్భాటంగా ఏర్పాట్లు చేయిస్తున్న భూషణం, రవి నోటినుండి చల్లగావచ్చిన యీ వార్త విని నిశ్చేష్టు డయాడు. దిగ్భ్రాంతి చెందాడు.

రవిని నిదానంగా ఆలోచించుకోమని హెచ్చరించాడు.

రవి తన మనసులో నిశ్చయాన్ని ఏమాత్రంతొణుకూ, బెణుకూ లేకుండా నిశ్చలంగా ప్రకటించాడు.

మామా - అల్లుళ్ళమధ్య ఘర్షణ జరిగింది.

భూషణం రవి నిర్ణయానికి శివంఎత్తిన వాడిలా విరుచుకుపడ్డాడు.

"ఇన్నాళ్ళూ నీమీద నేను పెట్టుకున్న నమ్మకాలని వమ్ము చేస్తావా?

నీకు నేనుఎక్కువా? ఆ బికారి వెధవలు ఎక్కువా?" అంటూ మండిపడ్డాడు.

"ఇందులో ఎక్కువ తక్కువల ప్రసక్తే లేదు. ఇది నా ధ్యేయంఅనుకున్నాను. నాకనీసకర్తవ్యంగా గుర్తించాను. అన్నాడు రవి.

"నువ్వు అమెరికా వెళ్ళకపోతే నా యింట్లో ఒక్క క్షణంకూడా వుండొద్దు. నీ దారి నువ్వు చూసుకో." అన్నాడు భూషణం.

"అలాగే మామయ్యా." అంగీకరించాడు రవి.

ఇంట్లో ఆవిధంగా పెద్ద గొడవ అయింది.

ఎవరికీ మనశ్శాంతిలేదు.

అందరి మనసుల్లో ఆందోళన, భయం ముప్పిరిగొన్నాయి.

కారణం. భూషణంగారు సింహంలాంటి మనిషి.

ఆయనకి కోపంవచ్చిందంటే, ఏభ్యా, వృూభ్యా ఏకం చేస్తాడు. ఆ మామకి తగిన అల్లుడే అన్నట్టు రవి అమెరికా ప్రయాణం మొండిగా తిరస్కరించాడు.

రాధ కన్నీళ్ళతో వచ్చి బావని బ్రతిమలాడింది.

"నాన్న చెప్పేదంతా మన క్షేమంకోరే బావా. నువ్వు చెయ్యదల్చుకున్నది ఎప్పుడైనా చేయవచ్చు. ముందు విదేశాలు వెళ్ళి రా. నాన్నకి ఆశాభంగం కలిగించకు." అంది.

రవి రాధకు అనునయంగా నచ్చచెప్పటానికి ప్రయత్నించాడు.

"నా ఆవేదన, ఆరాటం నీకు అర్ధంగావటం లేదు రాధా! మంచి చదువుయొక్క లక్ష్యం విదేశాలకి వెళ్లటం కాదు. వున్నతవిద్యలుపొంది యింకా, యింకా సుఖపడాలనే స్వార్ధమూ కాదు. మనవలన బలహీనులకి, అమాయకులకి అంతో యింతో వుపకారం జరగాలి. నువ్వు మర్చిపోయావా రాధా? నేనూ ఒకప్పుడు వీళ్ళందరిలా బీదవాడినే! మామయ్య సంపద నీడన తలదాచుకోవటంతో దాదాపుగా నేను అంటే ఏమిటో మర్చిపోయాను. నేను మర్చిపోయినా ఫర్వాలేదు. కానీ మానవత్వం మాత్రం మర్చిపోకూడదు. రాధా! చిన్నప్పుడు నీకు గుర్తుందా! మనం కోట మెట్లమీద కూర్చుని కబుర్లు చెప్పుకున్నప్పుడు, నువ్వు నన్ను 'యుద్ధానికి వెళ్ళి గెలుపుపొంది నాకు కానుకలు తీసుకురా బావా!' అనేదానివి. నేను వెడ్తున్న యుద్ధం యిదే రాధా!"

"నా కెందుకో భయంవేస్తోంది బావా!" అంటూ దీనంగా చూసింది రాధ.

రాధపని త్రిశంకు స్వర్గంలా వుంది.

అటు తండ్రివైపు ఆలోచిస్తే అదీ నిజమే అనిపిస్తోంది.

ఇటు బావవైపు చూస్తే యిదీ సత్యంగానేవుంది.

ఈ యిద్దరూ చెరోదిక్కు అవటంతో, రాధ ఆంతర్యం కంగారుతో బెంబేలు పడసాగింది.

* * * *

"రవి అమెరికా వెళ్ళటం లేదు" అన్న వార్త విన్న ఊళ్లోవాళ్ళంతా నిశ్చేష్టులయ్యారు.

కొంతమంది మామా - అల్లుళ్ళమధ్య వచ్చిన యీ మాటపట్టింపు ఎటువైపుకి దారితీస్తుందో - ఏమౌతుందో అని వినోదంగా, ఆసక్తిగా చూడసాగారు.

టీచరు రంగనాథంగారు, అందరినీ సమావేశపరచి, రవి నిజంగా, గ్రామసౌభాగ్యంకోసం నిలబడేట్టయితే అతనికి అన్నివిధాలా మనం పూర్తి అండగా నిలబడాలని అన్నాడు. అందరూ ఏకగ్రీవంగా, ముక్తకంఠంతో, తమ అంగీకారాన్ని తెలిపారు.

అక్కడ భూషణంగారి మిత్రులంతా కూడి, రవి నిజంగా మామగారిమాట వినకా, ఈ గ్రామరాజకీయాల్లో తలదూర్చినట్టయితే, అతనికి తగిన గుణపాఠం నేర్పాలని నిశ్చయించుకున్నారు.

భూషణంగారి పని మొగుడుకొట్టినదానికంటే, తోడు కోడలు నవ్విందనే సామెతగా అయింది. ఆయన యిన్నాళ్ళూ ఆర్భాటంగా అందరికి అల్లుడు అమెరికా వెళ్తున్నాడని

చెప్పాడు. ఇప్పుడు ఆ పని కాకపోగా, నలుగురిలో నవ్వులు పాలయేలా చేసాడు రవి.

రవికి నిజంగా విదేశాలు వెళ్ళటం యిష్టంలేకపోతే, అది మొదటే గుట్టుగా తనతో చెబితే పోయేది.

ఇంతజరిగి, తీరా పాస్‌పోర్టు వచ్చాక యీనిర్ణయమా!

ఆయన తలకొట్టేసినట్టయింది.

రవిని "నా యింట్లో ఒక్కక్షణం వుండటానికి వీల్లేదని పంపేసాడు. కానీ బ్రహ్మయ్య వాళ్ళతో "ఆ! చిన్నతనం! నాలుగురోజులు అలా వదిలేస్తే వాడికే తల తిరిగి గూట్లోకి వస్తుంది. అందుకే పంపేశాను" అన్నాడు.

* * * *

రవి కట్టుబట్టల్తో బైటకి వచ్చేసాడు.

అతని స్వంతయిల్లు చాలాపాతది అయి ఒక పక్కన పడిపోయివుంది. అందులో ప్రస్తుతం పందులు, ఊరికుక్కలూ తలదాచుకుంటున్నాయి. రవి ఆ యింటిముందు వచ్చి నిలబడ్డాడు.

"బాబుగారూ! మాకోసం ఎందుకు మీరింత కష్టపడుతారు. మామాటవిని జరిగిందేదో జరిగింది. వెళ్ళి మామయ్యగారు చెప్పినట్టు చెయ్యండి." అన్నాడు గూడెంపెద్ద వచ్చి.

గోపాలం అతనిమీద ఛర్రుమని లేచాడు.

క్షణంలో బిలబిలమంటూ అందరూ అక్కడకు వచ్చారు.

రెండుగంటల్లో ఆ జాగా అంతా శుభ్రమైంది.

పడిపోయిన గోడలకి తడికలు అడ్డం కట్టారు.

రంగి గబగబా వాకిట్లో నీళ్లుచల్లి ముగ్గువేసింది.

సాయంత్రం అయేసరికి రవి ఒంటరిగా ఆ యింట్లో కూర్చున్నాడు.

అతను ప్రొద్దుటనుంచి ఏం తినలేదు. చాలా ఆకలిగా, నీరసంగా వుంది.

రవికి గోడమీద ఎదురుగా తండ్రిఫోటో కన్పించింది.

తండ్రి ఆదర్శాల అడుగుజాడల్లో తను వెళ్లాలి. అతని మనసులో బాల్యస్మృతులు కొన్ని కదిలినాయి.

ఈ యింట్లో సిరిసంపదలకి లోటు లేకపోయినా, సుఖ సంతోషాలకి లోటువుండేది కాదు.

అరగంట తర్వాత రవి బైటికి వచ్చాడు.

అక్కడ అందరూ నిలబడివున్నారు.

అందరిచేతుల్లో తలో గిన్నె వుంది.

"ఏమి టవి?" అని అడిగాడు.

"బాబూగారూ! మీకు భోజనం." రంగి నసిగింది.

రవి భోజనం చేయలేదని, వాళ్ళందరూ ఎవరికి వాళ్ళే తయారుచేసి తెచ్చారు.

రవి అవన్నీ అక్కడపెట్టమని వాళ్ళని వెళ్ళమన్నాడు.

వాళ్లు వెళ్లిపోయిన తర్వాత దూరంగా దుమ్ములో ఆడుకుంటున్న పిల్లల్ని దగ్గరకి రమ్మని పిల్చాడు.

దగ్గరకివచ్చి నిలబడిన వాళ్లు అక్కడ తినే పదార్థాలు చూడగానే కళ్లు పెద్దవైనాయి.

వాళ్ళ మొఖాల్లో దైన్యం, కళ్ళల్లో ఆకలి, వాళ్ళని చుట్టుకునివున్న దారిద్ర్యం చూడగానే రవి గుండెల్లో కలియ తిప్పినట్టయింది.

పిల్లలందరినీ లోపలకు రమ్మన్నాడు.

వరసగా అందరినీ కూర్చోమని, ఆకులు పరిచి, తెచ్చిన వన్నీ వడ్డించాడు.

ఆ పిల్లలు విస్ఫారిత నేత్రాలతో చూసి సంబరంగా, గబగబా తింటుంటే రవి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

ఈ దేశానికి స్వతంత్రం వచ్చిన తర్వాత జరిగిందేమంటే వున్నవాళ్ళు మరీ వున్నవాళ్ళయి కోటీశ్వరులయారు.

లేనివాళ్ళు యింకా బికారులయ్యారు.

* * * *

రవి ఏటికి ఎదురీదటం ప్రారంభించినట్టే అయింది.

బ్రహ్మయ్యా వాళ్ళూ అతనిమీద పగబట్టిన తాచుల్లా బుసకొడ్తున్నారు.

ఎంతయినా భూషణం అల్లుడు.

ఆ వెరపు వెనక్కు లాగుతోంది. లేకపోతే యీపాటికి అతన్ని ఎప్పుడో సాఫ్ చేసేవాళ్ళు.

రవి ఆ వూళ్ళో బ్రతకటం దినదిన గండంగా వుంది.

దిక్పాలకుల్లా వున్న ఆ నలుగురికీ సంఘబలం కూడదీసుకుని ఎదురు తిరిగాడు.

అతనికి పైకి ఎంతో పెద్దమనుష్యులుగా కన్పించే వీళ్లు ఎంత కుత్సితులో, కపటవర్తనులో తెలిసిరాసాగింది.

ధర్మయ్య పేరుకి ధర్మయ్య. కానీ స్వభావంలో ఒట్టి దగాకోరు మనిషి. అతనిపని ఆ చుట్టుపక్కల పొలాలన్నీ కవులుకు తీసుకోవటం. భూమి ఆక్రమించుకున్న తర్వాత యజమానికి ఒక్క కానీ దక్క నీయకపోవడం. ఆ భూమిమీద వస్తున్న ఆదాయాన్ని తనే రాజాలా అనుభవిస్తాడు. వూళ్లో అతనిమాటకి ఎదురు లేదు. అతన్ని యిదేమిటి? అని అడిగే సాహసం ఎవరికీ లేదు.

పల్లెటూరులో, బ్రతక లేక, పొట్ట చేతపట్టుకుని పట్న వాసాలు వెళ్ళిన కుటుంబాలు ఆవూళ్ళో చాలా వున్నాయి. వాళ్ళందరికీ ఆ వూళ్ళో కాస్తో, కూస్తో పొలాలు వున్నా ధర్మయ్య పుణ్యమాలని, అవి అనుభవించే యోగ్యతలేకుండా పోయింది.

*　　*　　*　　*

సుభద్రమ్మ తల చెడిన మనిషి. భర్త చనిపోతే పిల్లలని అన్నగారి దగ్గరవుండి చదివించుకుంటోంది. ధర్మయ్యకి ఆవిడ పొలం కౌలుకి యిచ్చింది. ధర్మయ్య ఆ పొలాన్ని దాదాపు తన సొంతపొలంలా చేసేసుకున్నాడు.

ఆడమనిషి! ఆవిడతరఫున అడిగే దిక్కు లేదు.

ధర్మయ్య ఎదుటికి వచ్చి నిలబడి "యిదేమిటి?" అని అడిగేసాహసం లేదు ఎవరికీ.

ఆవిడ టీచరు రంగనాథానికి దూరంబంధువు అవుతుంది.

రవి యీ కథంతా విన్నాడు.

ఆవిడచేత ఆ పొలాన్ని గోపాలానికి కవులు వ్రాయించాడు.

గోపాలం ఆ పొలం ఆక్రమించుకున్నాడు.

ధర్మయ్య దౌర్జన్యానికి తన మనుష్యుల్ని పంపాడు.

గోపాలం, రవి యిద్దరూ స్వయంగా కట్టెలు చేతపట్టుకుని పొలందగ్గర నిలబడ్డారు.

రవిని, గోపాలాన్ని చితకతన్నటానికివచ్చిన మనుష్యులు రవి యుక్తిగా, తన సహజ వాక్చాతుర్యంతో, అసలుజరిగిన సంగతేమిటో వాళ్ళ మనస్సులకి బాగా పట్టేట్టు చెప్పటంతో వాళ్ళు తగాదా పడకుండా వెళ్ళిపోయారు.

ధర్మయ్యకి ఈ సంఘటన నషాళానికి అంటినట్టయింది.

* * * *

ఇంకోసారి -

వూళ్లో చెరువు మేటవేసింది.

బీదా, సాదా జనంఅంతా దానిలోనీళ్ళే తాగుతారు.

చెరువు ఎండిపోవటంతో ఎక్కడా ఒక్కచుక్క నీళ్ళు లేవు. బావులున్న వాళ్లెవరూ, యీ తక్కువకులాలవాళ్ళని తమ దొడ్లలోనికి రానివ్వటం లేదు.

జనం నీళ్ళకోసం అల్లాడిపోతున్నారు.

బ్రహ్మయ్య ప్రభుత్వానికి యీ విషయం తెలియచేస్తూ అప్లికేషన్ పెట్టాడు. ప్రభుత్వం టెండర్ కాల్ ఫర్ చేస్తే అది తనే తీసుకోవచ్చునని బ్రహ్మయ్య ఆశ.

కానీ అప్పటివరకూ చూస్తూకూర్చునే వ్యవధి లేదు.

రవి ప్రోత్సాహంమీద వూళ్ళో యువకు లంతా కలిసారు.

శ్రమదానంతో చెరువు తవ్వారు.

నీళ్లు వచ్చినాయి. వాళ్ళ సంతోషం చెప్పనలవికాదు.

వూళ్ళో జరిగిన విషయాలన్నీ ఎప్పటికప్పుడు, రంగడు వచ్చి భూషణానికి విన్పిస్తూంటాడు.

ఏ తలుపుచాటునో నిలబడి రాధ యివన్నీ చెవులు రిక్కించి వింటుంది.

* * * *

ఒకసారి సాయంత్రం వేళ.

రవి గూడేనికి వెళ్ళి తిరిగివస్తున్నాడు. రాధ వంటరిగా పాడుబడిన కోట మెట్లమీద కూర్చుని వుంది.

రవి పలకరించాడు.

రాధ జవాబు చెప్పలేదు. లేచి వేగంగా వెళ్ళిపో బోయింది.

రవి రాధచెయ్యిపట్టుకుని ఆపాడు.

రాధ రోషంగా మాటలు విసిరింది.

రవి ఆగ్రహపడలేదు.

రాధ కన్పరుస్తున్న యీ రోషంవెనక ఎంత బాధ, అభిమానం దాగివున్నాయో అతనికి తెలుసు.

రాధకి నచ్చచెప్పాడు.

చేతుల్లో ముఖం దాచుకుని ఏడుస్తున్న రాధ, "కనీసం మనిద్దరి పెళ్ళి అయేంతవరకైనా ఆగలేదు నువ్వు. కష్టమైనా, సుఖమైనా నీతో కలిసి పయనించాలనే నా ఆశలని నాశనం చేశావు" అంది.

రోజులు ఎప్పుడూ ఒకేరకంగావుండవని, ఎప్పటికైనా మామయ్య తనని గుర్తిస్తాడనే విశ్వాసం వుందని రాధకి ధైర్యంచెబుతూ బుజ్జగించాడు రవి.

గ్రామంలో పనిలేకుండా, సోమరితనంగా కాలంగడిపే వాళ్ళు చాలామంది వున్నారు. వాళ్ళకి చదువులేదు. కష్టపడి ఏదోరకంగా హాయిగా బ్రతకాలనే జ్ఞానంకూడా లేదు. వాళ్ళంతటవాళ్ళు దారిచూసుకునే మనుష్యులుకాదు వాళ్ళు. ఎవరైనా దారిచూపిస్తే గొర్రెలమందలా కళ్ళు మూసుకుని వెళ్ళిపోతారు.

నిజం చెప్పాలంటే వాళ్ళందరికీ పనిచేయాలన్నా ఇదే లేదు.

రవి ఆలోచించి, ప్రభుత్వానికి బంజరు భూములు పట్టాలకోసం వాళ్ళందరిచేతా దరఖాస్తులు పెట్టించాడు. రెవిన్యూ అధికారుల దగ్గరికి తిరిగి చివరికి ఎగ్గాగైతేనేం కొంత బంజరుభూమి వీళ్ళకు వచ్చేలా చేసాడు.

ఆ ప్రదేశం అంతా రాళ్లూ, రప్పలు, రక్కసముళ్ళు.

అక్కడక్కడా పల్లపు ప్రదేశం వుంది.

గోపాలం మొదలైన వాళ్ళంతా తమకి లభించిన భూములు ఆక్రమించుకున్నారు.

బ్రహ్మయ్యా వాళ్ళు తరతరాలనుంచి ఆ బంజరు భూముల్లో పశువుల్ని మేపుకుంటున్నారు. ఈ భూమి రవీ వాళ్లకి దక్కకుండావుండాలని ఆయనచేసిన ప్రయత్నంఅంతా వ్యర్థమే అయింది.

రవికి యిదో ఘనవిజయం.

భూషణం వాళ్ళకి మరో పరాజయం!

* * * *

భూషణం పట్నంలోవున్న రవి స్నేహితుడు ఆనంద్‌ని అర్జెంట్‌గా బైలుదేరి రమ్మనమని చెప్పాడు. అతను రాగానే యీ గొడవంతా చెప్పి, రవికి బుద్ధిచెప్పి దారికి తీసుకు రమ్మనమని కోరాడు.

ఆనంద్ రవిదగ్గరకు వచ్చాడు.

"హాయిగా అమెరికా వెళ్ళాల్సినవాడివి, నీ కిదేం ఖర్మరా" అన్నాడు.

రవి తను చేసిన పనులు చూపించాడు.

తన ధ్యేయం వివరించాడు.

ఎవరు ఏమనుకున్నా తను ముందుకు సాగిపోవాల్సిందే అన్నాడు.

ఆనంద్ చాలా ముగ్ధుడయాడు.

రవి కబుర్లవాది కాదని, కార్యవాది అని అతనికి తెలుసు.

రవి పట్టుదల, ఆత్మస్థయిర్యంకూడా బాగా తెలుసు.

ఆనంద్, రవిని అభినందించాడు.

ఆనంద్ తండ్రికి ట్రాక్టర్ల కంపెనీ వుంది.

ఈ భూమిని ఒకసారి దున్ని, అంతా చదునుచేసేందుకు తమ ట్రాక్టర్ని పంపుతానని వాగ్దానం చేసాడు.

రవిని మందలిస్తానని వెళ్ళిన ఆనంద్ తిరిగివచ్చి అతన్ని అభినందించడంతో, భూషణానికి చిరాకెత్తింది.

"రవిని ప్రోత్సహించవలసిందిపోయి, మీరిలా నిరుత్సాహపరచకూడదు" అన్నాడు. భూషణానికి అరికాలు మంట నెత్తి కెక్కింది.

ఆనంద్ నిజంగానే ట్రాక్టర్ పంపాడు.

రవి భూమి దున్ని చదునుచేసాడు.

దానిలో అందరూ కలిసి ఆనందంగా నాట్లువేసారు. వాళ్ళ సంతోషం చెప్పనలవి కాదు.

పంచె, షర్ట్‌తో, చేతులనిండా బురదమరకలతో, రవినిచూసినవాళ్ళెవరూ, నాలుగునెలలక్రితం మల్లెపువ్వుల్లాంటి బట్టలతో, దొరబాబులా వున్నమనిషి అని ఎవరూ అనుకోరు.

ఆడదిక్కులేని రవి యింటిబాధ్యత రత్తి తీసుకుంది. రత్తికి ప్రాణంతో సమానం అయిన భీముడిని రవి దారికి తెచ్చి, పనిలోపెట్టాడు. రవి పరిచయం వచ్చిన తర్వాత భీముడు తాగడం, జూదంఆడడం చాలావరకూ మానేసాడు.

కానీ వయసులోవున్న రత్తి, రవియింట్లో చనువుగా మెలగడం అందరికీ కాస్త ఎబ్బెట్టుగా వుంది.

ఈ వార్తకి అనేక వికృతార్థాలు కలిపి రాధ చెవిని వేసారు కొంతమంది.

కానీ బావసంగతి తెలిసిన రాధ నమ్మలేదు.

రాధ నిద్రపోతోంది.

రవి కిటికీలోనుంచి రాధ మంచంమీద వెళ్ళి పడేలా రాయి విసిరాడు.

రాధ కిటికీదగ్గరకు వచ్చి తొంగిచూసింది.

రవి రాధని దిగిరమ్మన్నట్లు సైగచేసాడు.

రాధ మెల్లగా, చప్పుడు కాకుండా, రహస్యంగా దిగి వచ్చింది.

రవి రాధని రెండుచేతులతో ఎత్తేసాడు.

"కళ్ళు మూసుకో." అన్నాడు.

రాధ కళ్ళు మూసుకుంది.

రవి రాధని అలాగే ఎత్తి తీసుకువచ్చి ఒకచోట దించి కళ్ళుతెరిచి చూడమన్నాడు.

రాధ కళ్ళు తెరిచింది.

ఎదురుగా ఒకప్పుడు, ముళ్ళతో, పిచ్చిమొక్కలతో, కాలుపెట్టటానికికూడా భయంవేసేట్టుండే యీ బంజరుభూమి, చదునుచేసి, పైరు నాటబడి కళకళలాడుతోంది.

రాధ సంభ్రమాశ్చర్యాలతో, అటువైపే చూస్తూ నిలబడిపోయింది.

రవి రాధ భుజాలుచుట్టూ చేయివేసి తనవైపు తిప్పు కుంటూ.

"యిప్పుడు చెప్పు రాధా! నేను చేసింది పొరపాటే నంటావా? నేను వెళ్ళకూడనిమార్గాన వెడ్తున్నానంటావా?" అన్నాడు.

రాధ కళ్ళు చెమ్మగిల్లినాయి.

నిశబ్దంగా, అతని గుండెల్లో తలదాచుకుంది.

ఆ వెన్నెల్లో, ఆ పరిసరాల్లో, రవి సాన్నిధ్యం రాధకి స్వర్గంలా వుంది.

ప్రేయసీ ప్రియులు కొద్దిసేపు కలతలు, మర్చిపోయి కలల్లో తేలిపోయారు.

* * * *

రాధ అర్ధరాత్రివేళ వంటరిగా బైటనుంచి రావటం భూషణంగారు చూసారు.

ఎక్కడికి వెళ్ళావని కూతురిని నిలదీసారు.

రాధ చెప్పలేక చెప్పింది.

భూషణంగారు కూతురిని మందలించాడు.

యిలాంటివి తను సహించనన్నాడు.

రాధ బుద్ధి తెలిసిన తర్వాత మొదటిసారిగా తండ్రికి ఎదురు తిరిగింది.

"బావ చేస్తున్న తప్పేమిటో చెప్పమంది. ఒక్కసారి వెళ్ళి అలా ఆ బంజరుభూమిని యిప్పుడెలావుందో చూసివస్తే బావ సమర్థత అర్థం అవుతుంది అంది.

భూషణంగారు రాధ అట్టే మాటలుమిగిలితే కాళ్లూ, చేతులు కట్టి తీసుకెళ్ళి మెడ్రాస్‌లో వున్న తన పింతల్లిదగ్గర దింపివస్తానని చెప్పాడు.

తండ్రితో ఘర్షణపడాల్సిరావటంతో రాధ అంత క్రితం రవితో గడిపిన మాధుర్యం అంతరించిపోయింది.

తన మనసు శరీరం బావకోసం ఎంత తపిస్తుందో, అనుక్షణం అతనికి దగ్గరగా వుండాలనే ఎలా కోరుకుంటోందో తండ్రికి అర్థంగాదు. తను విడమర్చి చెప్పలేదు.

* * * *

రాధ నిద్రపోయిందని నమ్మకంగా తెలుసుకున్న తర్వాత భూషణం వుత్తరీయం తలకుచుట్టుకుని కఱ్ఱతీసుకుని, పొలంవైపు వెళ్ళారు.

కొద్దిరోజులనుంచీ, అందరూ యీ బంజరుభూమిని గురించే మాట్లాడుతున్నారు.

ప్రతివాళ్ళ నోటినుంచి దానిగురించి ప్రశంసలే విన్పిస్తున్నాయి.

అదేమిటో చూస్తేగానీ ఆయనకి నిద్రపట్టేట్టు లేదు.

పొలందగ్గరకి వచ్చిన భూషణం నిజంగానే విభ్రాంతి చెందాడు. ఇది ఆ బంజరుభూమేనా అన్న అనుమానంవచ్చింది ఆయనకి.

వూళ్ళోకి హైస్కూలు వచ్చింది.

మనుష్యులు యిప్పుడిపుడే తాము శుభ్రంగావుండటం, పరిసరాలు శుభ్రంగా వుంచుకోవడం నేర్చుకుంటున్నారు.

రవి యిల్లు ఒక ఆఫీసులా తయారైంది.

అతనికి క్షణంకూడా విశ్రాంతి వుండదు.

ఇక్కడందరికీ రవిమీద గురిఏర్పడింది.

అతను మంటల్లో దూకమన్నా దూకుతారు.

రవికికూడా తృప్తిగా, ఆనందంగా అన్పించసాగింది.

ప్రభుత్వం యిస్తున్న ఋణాలని తీసుకుని కొంతమంది చేత చిన్నచిన్న కుటీరపరిశ్రమలు పెట్టించాడు.

స్త్రీ-పురుష భేదంలేకుండా అందరికీ పనికల్పించాడు.

రవికి వాళ్ళందరినీ చూస్తూంటే, కన్నకల నిజమైనట్టుగా వుంది.

కానీ, అతని ఆనందాన్ని భగవంతుడుకూడా చూడలేకపోయాడు. లేక రవి సహనాన్ని యింకా పరీక్ష చేయదల్చాడా!

ఒక్కసారిగా పెద్ద గాలీవానా వచ్చింది.

ఓ మాదిరిగా వున్న యిళ్ళన్నీ పడిపోయినాయి.

ఎక్కడచూసినా నీళ్ళు, నీళ్ళు' చెరువు నిండిపోయింది. దానికి కాపలాకాస్తున్నవాళ్ళు వచ్చి రవితో చెరువుకి గండికొట్టకపోతే కొత్తగ సాగుచేసిన ప్రదేశం అంత మునిగిపోతుందని చెప్పారు.

కానీ, చెరువుకి గండికొడితే ఆ నీళ్ళన్నీ భూషణంగారి తోటవైపుకే అవి వెళ్ళి అక్కడ పూలతోటని నాశనం చేస్తాయి.

రవి తను లేచి వెళ్ళాడు.

పరిస్థితి చూసాడు.

తనే స్వయంగా చెరువుకి గండికొట్టాడు.

సుళ్ళు తిరుగుతూ ప్రవహిస్తున్న నీళ్ళు ఒక్కసారిగా రాధతోటని ముంచేసి ప్రవహింపసాగినాయి.

ఆ నీళ్ళ వరవడికి, అతి సుకుమారంగా పెరుగుతున్న రాధ పూలమొక్కలు రూపులేకుండా నాశనమైనాయి.

భూషణంగారు వూళ్ళో లేడు.

కోర్టువ్యాజ్యం పనిమీద సిటీకి వెళ్ళారు.

రంగడువచ్చి యీవార్త చెప్పగానే రాధ పరుగున తోటలోకి వెళ్ళింది.

నీళ్ళమీద పువ్వులు, ఆకులు తేలి కొట్టుకు పోతున్నాయి.

రాధకి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

పట్టరాని ఆవేశం వచ్చింది.

ఆ వానలోనే సరాసరి రవి యింటికి వెళ్ళింది.

రవి యిళ్ళు కూలిపోయిన వాళ్ళకి తన యింట్లో ఆశ్రయం యిచ్చాడు. వాళ్ళకి భోజనాల ఏర్పాటు చూస్తు న్నాడు.

రాధ ఆవేశంగా వచ్చి రవిని మాటలంది.

రవి పరిస్థితి వివరించబోయాడు.

రాధ విన్పించుకోలేదు.

"నువ్వు మూర్ఖుడివి, కర్కోటకుడివి, రాక్షసుడివి. ఆ తోట నాకు ప్రాణంతో సమానం అని నీకు తెలియలేదూ? నీ చేత్తో నాటిన దాన్ని నువ్వే నాశనం చేశావు నువ్వు నాశనం చేసింది తోటని కాదు, నన్ను. నా మనసులో అను రాగాన్ని. నీకు అర్థం గాదు-"

నిశ్చేష్టుడైన రవి, కొత్త విషయం వింటున్నవాడిలా రాధని చేతులుజాచి దగ్గరకు తీసుకోబోయాడు.

రాధ నిర్లక్ష్యంగా అతని చేతులు తోసేసి సుడిగాలిలా వెళ్లిపోయింది.

తనమూలంగా రాధకి చాలా బాధ కలిగింది అనే విషయం రవి మనసులో కలుక్కుమనేలా చేసింది.

భూషణంగారు వూరినుంచి తిరిగివచ్చి జరిగిందంతా విన్నారు రాధని మెడ్రాస్ పంపేశారు. రాధ అభ్యంతరం చెప్పలేదు.

వూళ్ళో ఎవరికీ తింటానికి తిండిలేదు.

భూషణంగారు, బ్రహ్మయ్య అందరూ షావుకారుని పిలిచి వాళ్ళకి ఒక్క కానీ యివ్వటానికి వీల్లేదన్నారు.

ఎక్కడ చూసినా ఆకలి! ఆకలి!

రవికి పిచ్చెక్కేట్టుగా వుంది.

షావుకారుని అడిగితే యిప్పటికే చాలా బాకీలున్నాయని, ఒక్క పైసాకూడా యిచ్చేది లేదని ఖచ్చితంగా చెప్పేసాడు.

రవి తల్లి నగలు తీసుకుని పట్నంవెళ్ళి అవి అమ్మి డబ్బు తెచ్చాడు. అందరికీ తింటానికి తిండి లభించింది.

* * * *

మెడ్రాస్‌లో రాధ చాలా సుస్తీపడింది.

ఈ వార్త రవికి తెలిసింది.

కానీ అతనికి అడ్రస్ తెలియదు.

రంగడు అడ్రస్ రహస్యంగా తెచ్చియిచ్చి, రవిని తప్పకుండా వెళ్లి అమ్మాయిగారిని చూసిరమ్మనమని మరీ మరీ చెప్పాడు.

రవి సిటీ వెళ్ళాడు.

రాధ చాలా సుస్తీగా వుంది.

రవి ధైర్యం చెప్పబోయాడు.

రాధ తల తిప్పుతూ, 'నాకు చావే శరణ్యం. నాన్నా, నువ్వు యిద్దరూ యిద్దరే. పట్టుదల మనుష్యులు. మీ యిద్దరూ రాజీకి రారు. నేను మీ యిద్దరిలో ఎవరినీ వదులుకోలేను' అంది.

రవి రాధని ఎలా అనునయించాలో అర్థంగాలేదు.

రవి పల్లెకు తిరిగి వచ్చాడు.

అతని మనసుకి శాంతి లేదు.

క్షణం క్షణం కన్నీళ్ళతో రాధ ముఖమే కళ్ళెదుట నిలబడుతోంది. యిలా పరిస్థితులు యింకోరకంగా ఎదురు తిరుగుతాయని అతను అనుకోలేదు.

తను చేసిన పనివల్ల కొన్ని కుటుంబాలు స్థిరత్వం పొంది దారికి వచ్చినాయి. సుఖపడ్తున్నాయి. నిజమే!

కానీ తన జీవితం!

రాధలేని జీవితం అతను వూహించలేకుండావున్నాడు.

ఎదుటవారికి సహాయం చేయటం కోసం, తన జీవితం విషాదం చేసుకున్న దురదృష్టవంతుడు అవుతాడని అనుకోలేదు.

ఒక మంచి పని, తన శాంతి, సుఖం యిలా బలికోరు తాయనికూడా అనుకోలేదు.

ఈ లోపల ఒక విచిత్ర సంఘటన జరిగింది.

బ్రహ్మయ్యా, ధర్మయ్యా, భూషణానికి ఆప్తమిత్రులుగా, శ్రేయోభిలాషులుగా నటిస్తూనే, అతనికి తెలియకుండా ఒక దొమ్మీలో రవిని సఫాచేయాలని నిశ్చయించుకున్నారు. రవితో యీ వూరికి వచ్చిన పీడ రవితోనే పోతుందని వారి నమ్మకం.

ఆఖరి నిముషంలో భూషణానికి యిది తెలిసింది.

బ్రహ్మయ్యా వాళ్లు యీ విధంగా వెనక నుంచి దెబ్బ తీస్తారని కల్లోకూడా అనుకోని ఆయన నిశ్చేష్టుడయాడు.

రౌద్రాకారంతో, రుద్రమూర్తి అయిన భూషణం అల్లుడిని దక్కించుకోటానికి వేగంగా అక్కడకి వెళ్ళాడు.

అప్పటికే దొమ్మీ మొదలైంది.

ఇరుపక్షాలూ సమానంగా వున్నారు.

భూషణం కర్రతీసుకుని వాళ్ళలోకి వురికాడు.

బ్రహ్మయ్యా వాళ్ళని గాయపరిచాడు.

తను గాయపడ్డాడు.

ఇంతలో పోలీసులు వచ్చారు.

అందరినీ హాస్పిటల్లో చేర్పించారు.

కోర్టులో కేసుపెట్టారు.

రవి చెప్పిన సాక్ష్యంవల్ల బ్రహ్మయ్య, ధర్మయ్యలకి జైలు శిక్ష పడలేదు.

వాళ్ళు రవికి కృతజ్ఞతలు అర్పించుకున్నారు.

అందరు రవిలాంటి అల్లుడిని పొందినందుకు భూషణాన్ని అభినందించారు. భూషణం సగర్వంగా మీసం సరిచేసుకున్నాడు.

రాధా-రవిల వివాహం, ఆ చుట్టుపక్కల ఎప్పుడూ ఎవరూ కని విని ఎరగనంత వైభవంగా జరిగింది.